క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



అయిజ: మండలంలోని దేవబండ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ నాయకుడు సంకాపురం రాముడు విరాళం అందజేశారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దేవబండ గ్రామ ప్రజలు రాముడిని కలిసి ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని కోరగా విరాళంగా రూ. 50 వేలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



శాంతినగర్ : మండల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని నూతన ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నాగశేఖర్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

ఘనంగా జ్యోతిర్లింగ పూజ




అలంపూర్ రూరల్ : మండల పరిధిలోని క్యాతూర్ గ్రామంలోని శ్రీహరిహర దేవాలయంలో మెట్లపూజను శివస్వాములు ఘనంగా నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పోలింగ్ స్టేషన్ల వివరాల వెల్లడి

అయిజ: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల జాబితాను ఎంపీడీఓ వెంకటయ్య వెల్లడించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నోటీస్ బోర్డుపై వివరాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు సంబంధించి మొత్తం 78 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన సబ్‌స్టేషన్ మంజూరు



ధరూరు: మండల పరిధిలోని గుడ్డెందొడ్డి గ్రామానికి 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గుడ్డెందొడ్డి రఘువర్ధన్ రెడ్డి తెలిపారు. రైతుల సమస్యలు దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో ఉప ముఖ్యమంత్రి దృష్టి తీసుకెళ్లడంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐదు ప్రాజెక్టులు ఎంపిక

గద్వాల న్యూటౌన్: స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరిగిన ఎంపికల్లో జిల్లాకు చెందిన పాఠశాలల నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపిక అయ్యాయని డీఈఓ మహమ్మద్ అబ్దుల్ ఘని ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ అనంతాపురం, జెడ్పీహెచ్ఎస్ శెట్టిఆత్మకూర్ నుంచి రెండేసి చొప్పున, కేజీబీవీ అలంపూర్ నుంచి ఒక ప్రాజెక్ట్ ఎంపిక అయ్యిందని పేర్కొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,169

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శనివారం 1259 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 6169, కనిష్టం రూ.3516, సరాసరి రూ. 5719 ధరలు పలికాయి. అలాగే, 212 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ.7009, కనిష్టం రూ.1702, సరాసరి రూ.7009 ధరలు వచ్చాయి. 26 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ. 5566, కనిష్టం రూ. 5512, సరాసరి రూ. 5559 ధరలు లభించాయి.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న వైనం
- అధికారుల పర్యవేక్షణ కరువు
- గ్రామీణ క్రీడాకారుల్లో అసహనం



చిన్నపోతులపాడులో నిరుపయోగంగా ఉన్న క్రీడాప్రాంగణం

మానవపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని యువతను క్రీడలవైపు మళ్లించాలని, వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. యువతను చెడుదారి పట్టకుండా క్రీడలు ఆడించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశించించారు. నేడు ఆ పరిస్థితి మారింది. క్రీడా ప్రాంగాణల పర్యవేక్షణ లేకపోవడంతో పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రాంగణాల్లో ఆటలు ఆడేవారే లేరు. ఆడించే వారు కూడా లేరు. ప్రజాధనం వృథా అవుతున్నా అధికారులు నిమ్మకు నెరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని యువకులు, గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలు నిర్వహించడం లేదు..

మండలంలోని 17గ్రామ పంచాయతీల్లో ఒకటి, రెండు గ్రామ పంచాయతీల్లో తప్పా మిగితా వాటిలో ఉపాధి హామీ పథకం క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. ఇప్పటి వరకు ఏ గ్రామంలో కూడా క్రీడలు నిర్వహించిన దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో జిల్లా, అధికారులు, మండల స్థాయి అధికారులు ఒత్తిడి చేయడంతో తూతూ మంత్రంగా అందుబాటులో ఉన్న స్థలాలను ఎంపిక చేసి క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. కొన్ని పాఠశాలల్లో మరికొన్ని గ్రామాలకు దూరంగా ఉంటడంతో నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. పలు గ్రామాల్లో అధికారులు క్రీడా ప్రాంగణాలు చదును చేసి వదిలేశారు. మరికొన్ని చోట్లా పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. పాఠశాలలో సమయంలో క్రీడలు ఆడలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఏ గ్రామంలో చూసిన క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా గ్రామాల్లో ఉన్నతాధికారులు పర్యవేక్షించి గ్రామాల్లో క్రీడలను ప్రోత్సహించాలని, క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి..



గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగాయి.క్రీడల్లో రాణించాలనుకున్న గ్రామీణ క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం అందడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులకు క్రీడా సామగ్రి సమకూర్చి క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తీసుకురావాలి.

-రవికుమార్ క్రీడాకారుడు, చెన్నిపాడు

సామగ్రి సమకూర్చాలి..



గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. కానీ కనీస వసతులు ఏర్పాటు చేయలేదు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి సమకూర్చలేదు. పాఠశాలల్లో, గ్రామాలకు దూరంగా క్రీడా ప్రాంగణాలు నిర్మించి నిర్వహణ లేక గాలికొదిలేశారు. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి తేవాలి.

- సంజీవనాయుడు, గోకులపాడు

వసతులు కల్పిస్తాం..



గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి వచ్చేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిస్తాం. నిధులు లేని గ్రామాల్లో ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం. క్రీడా సామగ్రి సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటుంది.

-భాస్కర్ ఎంపీడీఓ, మానవపాడు

ప్రభుత్వం పరిహారం చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

అయిజ: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. దానికి ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఎమ్మార్సీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెదక్ జిల్లా చేగుంట మండలం క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ రమేష్, శ్రీనివాసులు విధుల్లో భాగంగా కాంప్లెక్స్ నుంచి ఎంఈఓ కార్యాలయానికి వెళ్లే క్రమంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారు. 15 సంవత్సరాలు విద్యాశాఖకు సేవలందించిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. శాంతియుతంగా నివాళులర్పించి, నిరసన తెలుపుతున్న క్రమంలో పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహేష్, ప్రణీత, కృష్ణవేణి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలి



ఆర్టీసీ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ తరువాత అయిజ బస్ స్టేషన్ నుంచి మాత్రమే ఎక్కువ ఆదాయం చేకూరుతుందన్నారు. అయిజలో ప్రయాణ ప్రాంగణ భవనం చిన్నదిగా ఉండడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. అయిజ బస్టాండ్ ప్రాంగణంలో కావల్సినంత విస్తీర్ణం ఉందని, అద్దె రూపంలో 80 దుకాణాల గదుల నుంచి ఆర్టీసీ శాఖకు ఆదాయం వస్తుందన్నారు. బస్టాండ్ ప్రాంగణంలో కనీసం మంచినీటి వసతి కూడా కల్పించలేదని విమర్శించారు. అయిజలో నూతనంగా మౌలిక వసతులులతో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణ భవనం నిర్మించని యెడల బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల పోషణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



గేదెకు చికిత్స చేస్తున్న పశువైద్యులు

గద్వాల వ్యవసాయం: మండల పరిధిలోని అనంతాపురంలో శనివారం ఎస్ఎంఎఫ్‌జీ సహకారంతో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో భాగంగా మండల పశువైద్యాధికారి అర్పిత, పశువైద్యులు యామిని, వినయ్‌కుమార్ 15 ఆవులు, 95 గేదెలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 66 దూడలకు నట్టల నివారణ మందు తాపడంతో పాటు, 15 దూడలకు చికిత్స చేశారు. పాడి రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ అర్పిత, ఎస్ఎంఎఫ్‌జీ మేనేజర్ విజయ్‌కుమార్ మాట్లాడారు. పాల దిగుబడి పెంపునకు నిత్యం పశువులకు సరైన పోషణ అందించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎంఎఫ్‌జీ ప్రతినిధులు వసంత్, వినోద్, ఉమేష్, సైఫ్, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో ముమ్మరంగా తనిఖీలు



చెక్‌పోస్టు వద్ద పశుసంవర్ధక శాఖ అధికారులు, పోలీసులు

అలంపూర్ : అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పశుసంవర్ధక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో శనివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అధికారులు శంకరయ్య, వరప్రసాద్, మాధవీలత, ఉండవెల్లి పోలీసులు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే కోళ్ల, కోడి గుడ్ల వాహనాలు తనిఖీ చేపట్టి వాహనాలు తిరిగి వెనక్కి పంపుతున్నారు. కార్యాలయంలో చెక్‌పోస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ బాటలో నడవాలి



మల్లాపురం తండాలో సేవాలాల్ పూజలో గిరిజనులు

కేటీదొడ్డి: సంత్ సేవాలాల్ మహరాజ్ బాటలో ప్రతి ఒక్కరు నడవాలని సేవాలాల్ కమిటీ సభ్యులు ధనుంజనాయక్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మల్లాపురంతాండ, ఉమిత్యాలతండా, గువ్వలదిన్నెతండాల్లో బంజారా సంప్రదాయం ప్రకారం బోగు పూజా చేసి సేవాలాల్ జయంతిని నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ గిరిజనులకే కాకుండా అందరికీ ఆరాధ్యులన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గిరిజనులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చండి సారూ..



మానవపాడు: మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే రహదారి గుంతల మయమంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు శనివారం నిరసన తెలిపారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శిథిల కల్వర్టుతో ఇబ్బందులు



ఇటిక్యాల: మండల కేంద్రంలో ఆర్అడ్‌బీ ఆధ్వర్యంలో నిర్మించిన కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతిఏటా వర్షాకాలం వచ్చిందంటే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తున్న అధికారులు పటఇంచుకోవడం లేదన్నారు. తేలికపాటి వర్షాలు కురిసినా కల్వర్టు మొత్తం నీటిలో మునిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారులకు పలుమార్లు సమస్యను విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధిరులు తక్షణమే స్పందించి కల్వర్టును నిర్మించాలని ఆయా గ్రాయాల వాహనదారులు కోరుతున్నారు.

కంది రైతులను దోచుకుంటున్నారు



అయిజలో కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

అయిజ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు దారులు రైతులను దోచుకుంటున్నారని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డ్‌లో నిర్వహిస్తున్న కందుల కొనుగోలు కేంద్రాన్ని పల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో 50 కేజీల బస్తాకు 600 గ్రాములు అదనంగా తీసుకోవాలని మార్క్‌ఫెడ్ డీఎం ఆదేశాలు జారీ చేశారని, అయితే కొనుగోలు కేంద్రంలో అదనంగా 1 కేజీ 300 గ్రాములు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలిపారు. సంబంధిత అధికారులను ఈ విషయపై నిలదీస్తే ముఖం చాటేసి వెళ్లిపోవడమంటే రైతులను మోసం చేసినట్లే ఆరోపించారు. ప్రభుత్వం ఎకరాకు 6 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీఆర్ఎస్వీ నాయకులు

శాంతినగర్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటి ముందస్తుగా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని పదేళ్లపాటు సుభిక్షంగా వికాస తెలంగాణగా రూపుదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉచిత స్కూటీ, మహిళలకు ఆర్థికసాయం కింద నెలకు రూ.2500 ఇస్తామన్న హామీలు ఎప్పుడు నెరవేరుస్తారని మండిపడ్డారు. అనంతరం ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీల 15ఏఎల్‌పి308) అయిజలో కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య హామీని సాధించేందుకు విద్యార్థులు పోస్టుకార్డుల నిరసన వ్యక్తం చేస్తూ ఉద్యమం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రవీణ్, గంగాధర్, మాధవ్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఐడీలు నమోదు చేయాలి



అపార్ నమోదుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎర్రవల్లి: అపార్ ఐడీల నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఉమ్మడి ఇటిక్యాల మండలాల విద్యాధికారులు అమీర్‌పాషా, వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం కొండేరులోని మండల వనరుల కేంద్రంలో ఆయా మండలాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల వారిగా అపార్ ఐడీల నమోదు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అపార్ ఐడీ నమోదులో ప్రైవేట్ పాఠశాలలు వెనుకబడి ఉన్నాయన్నారు. తప్పనిసరిగా ప్రతి విద్యార్థికి ఐడీని నమోదు చేయాలని సూచించారు. నమోదు ప్రక్రియలో ఏదైనా సమస్యలు ఉంటే మండల వనరుల కేంద్రంలోని సిబ్బందితో నివృత్తి చేసుకోవాలన్నారు. త్వరితగతిన నమోదును చేపట్టి 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఖాజా, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



కుర్తిరావల్‌చెర్వు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో మహేష్

మల్దకల్ : పదో తరగతి వార్షిక పరీక్షల సమయం సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని జీహెచ్ఎం మహేష్ సూచించారు. శనివారం మద్దెలబండ, కుర్తిరావల్‌చెర్వు, బిజ్వారం, పాల్వాయి, విఠలాపురం, తాటికుంట జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చదువుకునేందుకు కావాల్సిన మెళకువలు సూచించారు. ప్రతి విద్యార్థి సందేహాలను తరగతి గదిలోనే నివృత్తి చేసుకోవాలన్నారు. ఇంటి దగ్గర ప్రశాంత వాతవరణంలో చదివి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ డీకే అరుణ

గద్వాలటౌన్: ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు అబద్ధపు వాగ్దానాలతో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చి అప్రజాస్వామ్య పరిపాలన సాగిస్తున్నారని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ఆరోపించారు. మల్దకల్ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వాసురెడ్డి శనివారం బీజేపీ పార్టీలో చేశారు. ఎంపీ డీకే అరుణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భం ఆమె మాట్లాడారు. మహిళలకు రూ.2500, తులం బంగారం, స్కూటీ వాహనం అందిస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధుల మంజూరే లేదని విమర్శించారు. ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామంజనేయులు, తిరుపతిరెడ్డి, బండల వెంకట్రాములు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య



విద్యార్థులకు పెన్నులు అందిస్తున్న అధ్యాపకులు

ఆత్మకూర్: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని స్థానిక జూనియర్ కళాశాల అధ్యాపకులు అన్నారు. పదో తరగతి అనంతరం విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని అధ్యాపకులు కోరారు. శనివారం డీఐఈఓ అంజయ్య, ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్‌రెడ్డి సూచన మేరకు స్థానిక ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు కురుమూర్తి, బుచ్చయ్య అమరచింత, ఆత్మకూర్, చిన్నచింతకుంట మండలాల్లో పర్యటించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కల్పిస్తున్న వసతులపై ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలుగు, ఆంగ్లంలో విద్యాబోధనలు జరుగుతున్నాయని, ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈసందర్భంగా పది విద్యార్థులకు పెన్నులు అందజేసి ప్రైవేట్ కళాశాల్లో చేరి తల్లిదండ్రులకు ఆర్థిక భారం కలిగించకుండా మెరుగైన విద్య అందుతున్న ప్రభుత్వ కళాశాలలో చేరాలని సూచించారు.

ఘనంగా తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- తొలిరోజు వైభవంగా శోభాయాత్ర
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



తిక్కవీరేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



ప్రత్యేక వేషధారణతో నృత్యం చేస్తున్న కళాకారులు

అయిజ: పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా తొలిరోజు ఆలయ అర్చకుడు లక్ష్మిరెడ్డి నివాసం నుంచి ఆలయం వరకు తిక్కవీరేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిపై ఊరేగించారు. మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో శోభాయాత్ర కనులపండువగా సాగింది. మహిళలు మంగళ హారతులతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత నందికోళ్ల సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊరేగింపులో కళాకారులు దేవతామూర్తుల వేషాధారణతో ప్రత్యేకంగా నృత్యం చేసి అలరించారు. అనంతరం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. స్వామివారి నామస్మరణతో పట్టణం మార్మోగింది.